క్లుప్తంగా

గృహ నిర్మాణాలపై సమీక్ష

పాలకోడేరు: పాలకోడేరు, విస్సాకోడేరు గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులంతా ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించేలా అధికారులు, స్థానిక నాయకులు కృషి చేయాలని గృహ నిర్మాణ శాఖ డీఈ బీవీ రమణ సూచించారు. పాలకోడేరు మండలంలో గృహ నిర్మాణ పనుల ప్రగతిపై మండల పరిషత్ కార్యాలయంలో అధికారులకు శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇళ్ల స్థలం పొందిన ప్రతి లబ్ధిదారులు ఇంటి నిర్మాణలు ప్రారంభించేలా సచివాలయ ఇంజనీరింగ్ సహాయకులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీవో ఎస్. మురళీ గంగాధరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

భీమవరం డివిజన్ ప్రధాన కార్యదర్శిగా పంపన సురేష్

పాలకోడేరు: గ్రామ రెవెన్యూ అధికారుల భీమవరం డివిజన్ ప్రధాన కార్యదర్శిగా పంపన సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈయన మోగల్లు వీఆర్వోగా పని చేస్తున్నారు. శనివారం భీమవరం ఎన్జీవో భవనంలో నిర్వహించిన డివిజన్ సమావేశంలో అధ్యక్షుడు కెనడీ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. ఎన్నికైన సురేష్‌ను పాలకోడేరు తహసీల్దార్ షేక్ హుస్సేన్ పలువురు వీఆర్వోలు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కోటేశ్వరరావు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నేడు రైల్వే గేటు మూత

పాలకోడేరు: రైల్వే ట్రాక్ మరమ్మత్తుల నిమిత్తం శృంగవృక్షం రైల్వే గేటును 26వ తేదీ ఉదయం 7 గంటల నుంచి 27వ తేదీ ఉదయం 8 గంటల వరకు రెండు రోజుల పాటు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారని ఇన్‌చార్జ్ పంచాయతీ కార్యదర్శి కె వెంకటరాజు తెలిపారు. ప్రయాణికులు తమకు సహకరించాలని కోరారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పాలకోడేరు: మండలంలో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ల పోస్టులకు ఈనెల 24 నుంచి 29వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాలకోడేరు ఎంపీడీఓ నూకల మురళీగంగాధర్‌రావు తెలిపారు. గొల్లలకోడేరు పోస్టు ఓసీ మహిళకు కేటాయించారు. కుముదవల్లిలోని మూడు ఖాళీల్లో ఓసీ మహిళకు-1, ఓసీ జనరల్‌కు-2, పాలకోడేరు -2 పోస్టును ఓసీ జనరల్‌కు, పెన్నాడ- 2 పోస్టును బీసీ జనరల్‌కు, శృంగవృక్షం-3 పోస్టును బీసీ-ఈ మహిళకు కేటాయించినట్లు ఎంపీడీఓ తెలిపారు.

భర్త కనిపించడం లేదంటూ భార్య ఫిర్యాదు

ఉండి: భర్త కనిపించడం లేదంటూ భాభార్య శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉండి మండలం పెదపుల్లేరు గ్రామానికి చెందిన కలిదిండి శివరామరాజు కొంతకాలంగా మతిస్థిమితం సరిగ్గా లేకపోవడంతో భీమవరం ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. నెల 16న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి 17వ తేదీన తాను విజయవాడలో ఉన్నానని ఇంటికి వచ్చేరదుకు రైలు ఎక్కుతున్నానని భార్యకు ఫోన్ చేసి చెప్పాడు. తన భర్త ఇంత వరకు ఇంటికి రాలేదంటూ అతని భార్య అన్నపూర్ణ చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఏప్రిల్‌లో తాడేరు వంతెన పనులకు శంకుస్థాపన

ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



ఆర్అండ్‌బీ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

సాక్షి, భీమవరం: వచ్చే నెల మొదటి వారంలో తాడేరు వంతెన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ఆయన క్యాంపు కార్యాలయంలో శనివారం ఆర్అండ్‌బీ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాడేరు వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ.2.30 కోట్లు నిధులను మంజూరు చేసిందని, టెండర్ ప్రక్రియ కూడా ముగిసింది అని, వచ్చే నెల మొదటి వారంలో ఆర్అండ్‌బీ శాఖ మంత్రి దాడిశెట్టి రాజా చేతుల మీదుగా శంకుస్థాపన జరుగుతుందని పేర్కొన్నారు. భీమవరం నియోజకవర్గంలో ఆర్అండ్‌బీ శాఖ నిధులతో చేపట్టిన రోడ్ల పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముఖ్యంగా గ్రామాలను అనుసంధానం చేస్తున్న రోడ్ల మరమ్మతులను కూడా ప్రస్తుతం వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. అదే మాదిరిగా రోడ్ల ప్యాచ్‌వర్క్‌లకు మరో రూ.కోటి నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపామని అన్నారు. యనమదుర్రు డ్రెయిన్‌పై వంతెనలకు కూడా అప్రోచ్ రోడ్ల నిర్మాణ నిమిత్తం రూ.36 కోట్ల నిధులను మంజూరు చేయించామని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి పని చేస్తున్నామని, అభివృద్ధి దిశగా రాష్ట్రంలోనే భీమవరం నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు కాండ్రేగుల నరసింహరావు, ఆర్అండ్‌బీ శాఖ ఈఈ లోకేశ్వరరావు, డీఈ రామరాజు, జేఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



భీమవరంలో ఏపీ బహుజన జేఏసీ ఆధ్వర్యంలో జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చుతూ అసెంబ్లీలో తీర్మానం చేయడాన్ని ఏపీ బహుజన జేఏసీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. శనివారం అంబేడ్కర్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించి జేఏసీ ఫౌండర్ అండ్ కన్వీనర్ తాళ్లూరి మధు మాట్లాడుతూ ఎస్సీలకు బీసీ-సి సర్టిఫికెట్స్ ఇస్తూ ఎస్సీలకు రావాల్సిన రాయతీలు, ఉద్యోగ అవకాశాలను కోల్పోతున్న వారికి అండగా ఉండడానికి ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం హర్షదాయకమన్నారు. తీర్మానం పార్లమెంట్‌లో ఆమోదం పొందేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కోనా జోసఫ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ బుంగా ఆదాము, జిల్లెళ్ల సత్య సుధామ, మీసాల జయరాజు, సీలం క్రాంతికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

దళిత క్రైస్తవులకు అండ

సాక్షి, భీమవరం: దళిత క్రైస్తవులను ఎస్సీల్లో చేర్చుతూ అసెంబ్లీలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టడం హర్షనీయమని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ అన్నారు. శనివారం చినఅమిరంలో జిల్లా అధ్యక్షుడు నేతల సువర్ణ రాజు అధ్యక్షతన జరిగిన మాల మహానాడు ముఖ్య కార్యకర్తల సమావేశంలో పుష్ప రాజ్ మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా దళిత క్రైస్తవులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎన్ని ప్రభుత్వాలు మారినా మోక్షం కలగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దళితుల ప్రభుత్వంగా చెప్పుకుంటున్న జగన్‌మోహన్‌రెడ్డి దళిత క్రైస్తవులను ఎస్సీల్లో చేర్చేలా తీర్మానం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సంధి జయరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి కోలాటి ప్రసాదరావు, నన్నేటి నాగరాజు, మానుకొండ కిరణ్, పిట్టా వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దళిత ఐక్యవేదిక ఆనందం......

దళిత క్రైస్తవులను ఎస్సీల్లో చేర్చుతూ శాసనసభలో తీర్మానం చేయడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిబద్ధతకు నిదర్శనమని దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర కుమార్ అన్నారు. భీమవరం 21వ వార్డులో నిర్వహించిన పట్టణశాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక తరపున ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలపర్తి జోనా, మర పట్ల మునియ్య, ఆలమూరి బాబ్జి, ఉండ్రు విల్సన్, గెడ్డం జార్జ్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు



పాలకోడేరులో గాలికుంటు వ్యాధి టీకా కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ చంటి రాజు

ఆకివీడు: వైరస్ వల్ల వచ్చే గాలి కంటు వ్యాధిని అరికట్టేందుకు వ్యాధి నిరోధక టీకాలను ప్రతి పశువుకూ వేయించాలని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు కే.జనార్దనరావు విజ్ఞప్తి చేశారు. స్థానిక అర్బన్ పశువైద్య శాలలో శనివారం టీకాలు వేసే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఆకివీడులో 150 పశువులకు, మండలంలోని అయిభీమవరంలో 50 పశువులకు వ్యాధినిరోధక టీకాలు వేశారు. వెటర్నరీ వైద్యురాలు కెల్లా భార్గవీ సత్య, ఇతర వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్యానికి ప్రాముఖ్యత

ఉండి: యండగండి సర్పంచ్ గోగులమండ చినకృష్ణమూర్తి అన్నారు. శనివారం గ్రామంలోని పశువులకు గాలికుంటు వ్యాధికి వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి పర్యవేక్షించారు. పశువైద్య సిబ్బంది గంగరాజు,రామారావు పాల్గొన్నారు.

పాడి పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు

పాలకోడేరు: గాలికుంటు వ్యాధి నివారణకు పశులువకు వేసే టీకాను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ భూపతి రాజు సత్యనారాయణ రాజు (చంటి రాజు) అన్నారు. పాలకోడేరు మండల పరిధిలో ఆయా గ్రామాల్లో నేటి నుంచి గాలి కుంటు టీకాలు వేసే కార్యక్రమాన్ని పశు వైద్యులు, భూపతి రాజు సత్యనారాయణ రాజు శనివారం ప్రారంభించారు. మండల పశు వైద్యాధికారి మౌర్య సత్యేంద్ర, మోగల్లు పశు వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక రాబర్ట్ హేమ సిబ్బంది పాల్గొన్నారు.

వెంప గ్రామంలో

భీమవరం అర్బన్: వెంప గ్రామంలో జాతీయ గాలి కుంటు వ్యాధినివారణకు పశువులకు టీకాల కార్యక్రమాన్ని మండల వెటర్నరీ వైద్యుడు పి. వుండరీబాబు శనివారం ప్రారంభించారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

ఉండి: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా స్థానికంగా ఉండే విద్యార్థులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు మండల వైద్యాధికారి పీ ధర్మతేజ్ అన్నారు. శనివారం ఉండి రెండోవ సచివాలయ పరిధిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజల ఆరోగ్య స్థితిగతులు పరీక్షించడంతో పాటు ఆయా పాఠశాల్లో విద్యార్థులను పరీక్షించారు. పలువురు ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాలుర హాస్టల్ తనిఖీ

సాక్షి, భీమవరం: హాస్టల్ విద్యార్థులకు అందించే ఆహారంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి డి.ధనరాజు హాస్టల్ వార్డెన్‌కు సూచించారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఆయన కుముదవల్లిరోడ్డులోని బీసీ సంక్షేమ బాలుర హాస్టల్‌ను తనిఖీ చేశారు. మరుగుదొడ్లు, వంటశాల, బాలురు ఉంటున్న గదులను శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. హాస్టల్ వార్డెన్ సిహెచ్. మోహన్ రావు, ప్యానల్ లాయర్ బి.సునీల్ కుమార్ పాల్గొన్నారు.

పెదకాపవరం పీహెచ్‌సీ అభివృద్ధికి కృషి

ఆకివీడు: పెదకాపవరం పీహెచ్‌సీ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని మండల పరిషత్ అధ్యక్షురాలు, పీహెచ్‌సీ అభివృద్ధి, సలహా కమిటీ అధ్యక్షురాలు కఠారి జయలక్ష్మీ చెప్పారు. పీహెచ్‌సీ అభివృద్ధి, సలహా కమిటీ సమావేశం శనివారం ఆసుపత్రి ఆవరణలో నిర్వహించారు. సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ గతేడాది కాలంగా పీహెచ్‌సీలో వసతుల్ని మెరుగు పరచామన్నారు. ఆసుపత్రి ఆవరణలో విశాలమైన స్థలాన్ని సమావేశ హాలు నిర్మాణానికి సలహా కమిటీ తీర్మానం చేసిందన్నారు. ప్రస్తుతం ఈ స్థలంలో పాడుబడిన పెంకుటుశాల ఉందని, దానిపై మండల పరిషత్ అధికారులతో మాట్లాడి వేలం నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఆసుపత్రి కమిటీ కన్వీనర్ ఎండీ. మెహారున్నీస్సా బేగం మాట్లాడుతూ ఈ ఏడాది రూ.1.76 లక్షల నిధులు మంజూరయ్యాయని చెప్పారు. ఆసుపత్రి మెయింటనెన్స్‌కు, ఫర్నీచర్ మరమ్మతులకు సుమారు 85 శాతం నిధుల వినియోగించినట్టు చెప్పారు. కమిటీ సభ్యులు గురువెల్లి అన్నపూర్ణ, గ్రామ పెద్ద కఠారి కేశవరావు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ పోటీల్లో విజేత విష్ణు విద్యార్థులు

సాక్షి, భీమవరం: రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో భీమవరం విష్ణు ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు విన్నర్‌గా విజయం సాధించారని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు శనివారం విలేకరులకు చెప్పారు. తాడేపల్లిగూడెం శ్రీ వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన పోటీల్లో తమ విద్యార్థులు విజయం సాధించారన్నారు. ఈ సందర్భంగా విజేతలను కళాశాల ప్రిన్సిపాల్ దశిక సూర్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్, పీడీ శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.

అమ్మవార్లకు వెండి కిరీటాలు

కాళ్ల: బొండాడలోని అమ్మవార్లకు వెండి ఆభరణాలు సమర్పించడం అభినందనీయమని ఉండి ఏఎంసీ మాజీ చైర్మన్ మన్నే నాగరాజు, ఆలయ చైర్మన్ పెన్మెత్స రంగరాజు దాతలను అభినందించారు. కాళ్ల మండలంలోని బొండాడలో వేంచేసియున్న పోలేరమ్మ, మహాలక్ష్మి అమ్మవార్లకు దేవస్థానం అర్చకులు చెరుకువాడ వెంకటరావు కుటుంబ సభ్యులు అమ్మ వార్లకు రూ.1,30,000 విలువ గల 1,600 గ్రాములు వెండి కిరీటాలను శుక్రవారం సమర్పించారు. అనంతరం అమ్మవార్లకు వాటిని అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఈవో వేగేశ్న ఆంజనేయరాజు, ధర్మ కర్తలు, గ్రామ పెద్దలు, పాల్గొన్నారు.

స్థలం ఆక్రమణపై కేసు

భీమవరం అర్బన్: స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం పంచాయతీ స్థలాన్ని ఆక్రమించిన వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు.యనమదుర్రుకి చింతపల్లి మోహన్ రావు, ఆయన కుమారుడు చింతపల్లి దేవాదత్తం పంచాయతీ డ్రెయిన్‌ను ఆక్రమించి పాకవేయడంతో కార్యదర్శి, వీఆర్వో ఫిర్యాదు మేరకు ఎస్సై మోహన్‌రావు కేసు నమోదు చేశారు.

జూదరుల అరెస్ట్

భీమవరం అర్బన్: దయ్యాలతిప్పలో శనివారం డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్ఈబీ ఎ.కోటేశ్వరరావు తన సిబ్బందితో పేకాట శిబిరంపై దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్దనుంచి రూ. 16,500, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. రూరల్ ఎస్సై మోహన్ రావు కేసు నమోదు చేశారు.

దళిత క్రైస్తవులను ఎస్సీల్లో చేర్చడం హర్షణీయం

ఉండి: దళిత క్రైస్తవులను ఎస్సీల్లో చేర్చేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శాసనసభలో తీర్మానం చేయడం హర్షణీయమని క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్రపాటి అనిత అన్నారు. ఈ సందర్భంగా శనివారం ఉండిలో ఆమె మాట్లాడుతూ ఎన్నో దశాబ్దాల నుంచి దళిత క్రైస్తవులను ఎస్సీల్లో చేర్చాలంటూ చేస్తున్న పోరాటానికి ఎవ్వరూ వారికి కనీసం మాట సాయం చేయలేదని, ఇప్పుడు ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో శాసనసభలో తీర్మానం చేయడం ద్వారా దళిత క్రైస్తవుల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. వెనుకబడిన సామాజిక వర్గాలకు అండగా ఉంటూ కార్పొరేషన్లు ఏర్పాటు చేయడమే కాకుండా ఆయా సామాజిక వర్గాల అభివృద్ధికి పాటుపడుతున్నారని అన్నారు. రాష్ట్రాభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని వెనుకబడిన వారిని ముందుకు నడింపిచేందుకు ముఖ్యమంత్రి జగన్ చేస్తున్న కృషి అభినందనీయమని అనిత అన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

భీమవరం అర్బన్: బాల్య వివాహాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చట్టాలు అమలులో ఉన్నాయని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పి..వరలక్ష్మి అన్నారు. మండలంలోని కొవ్వాడ అన్నవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విస్సాకోడేరు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో శనివారం బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్ వైజర్ పి.వరలక్ష్మి మాట్లాడుతూ యువతులకు 18, యువకులకు 21 సంవత్సరాలు దాటిన తరువాతనే వివాహం చేయాలన్నారు. బాల్య వివాహాలు వల్ల కలిగే నష్టాలు గురించి వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్య స్వరూపం తదితరులు పాల్గొన్నారు.

భీమవరం సబ్ జైలు తనిఖీ

సాక్షి, భీమవరం: పట్టణంలోని ప్రత్యేక కారాగారాన్ని ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎ.పవన్ కుమార్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్ష పడిన ఆర్థిక స్థోమత లేని ముద్దాయిలు అప్పీల్ ఫైల్ చేసుకోడానికి మండల న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయాన్ని పొందవచ్చునన్నారు. ఆయన వెంట ఉచిత న్యాయ సలహాదారుడు బి.సునీల్ కుమార్, జైలు పర్యవేక్షణాధికారి వెంకటగిరి ఉన్నారు.

ఆల్ ఇండియా స్కాలర్‌షిప్‌కు ఇద్దరు విద్యార్థుల ఎంపిక

ఆకివీడు: పెదకాపవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 35 ఏళ్ల చరిత్రలో జాతీయస్థాయి ఉపకార వేతనం (ఎన్.ఎం.ఎం.ఎస్)ను ఈ ఏడాది ఇద్దరు విద్యార్థులు సాధించడం గర్వకారణమని ప్రధానోపాధ్యాయులు కాళహస్తేశ్వరుడు చెప్పారు. బద్దని జానకీరామ్, బూరగ ఎరూషా గోల్డ్ ఉత్తీర్ణులయ్యారని హెచ్ఎం చెప్పారు. 9,10, ఇంటర్ తరగతుల వరకూ నాలుగేళ్ల పాటు రూ. 12 వేలు చొప్పున ఉపకార వేతనం వారికి వస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్ఎం, ఉపాధ్యాయురాలు అభినందించారు.

ఎంపీడీఓ సమీక్ష

పాలకోడేరు: నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీవో ఎస్. మురళీగంగాధరరావు సిబ్బందికి సూచించారు. పాలకోడేరు మండల పరిషత్ కార్యాలయంలో ఆయుష్మాన్ భారత్, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు, ఆధార్ నవీకరణ తదితర అంశాలపై సచివాలయ సిబ్బంది, అధికారులతో శనివారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఆయుష్మాన్ భారత్ సర్వేని వేగంగా పూర్తి చేయాలన్నారు. ఆధార్ నవీకరణ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు.

ఎస్‌డీజీ సర్వేపై సచివాలయ సిబ్బందికి శిక్షణ



మండల పరిషత్ కార్యాలయంలో ఎస్‌డీజీ సర్వేపై సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇస్తున్న ఎంపీడీవో

ఉండి: ఎస్‌డీజీ (సుస్థిరాభివృద్ధి లక్ష్యాల) సర్వేను యుద్ధప్రాతిపదిక పూర్తి చేయాలని సచివాలయ ఉద్యోగలను ఎంపీడీవో ఏవీ అప్పారావు ఆదేశించారు. శనివారం మండలస్థాయిలో గ్రామ సచివాలయానికి చెందిన వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీస్, ఏఎన్ఎం, అంగన్‌వాడీ వర్కర్లకు ప్రత్యేక శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మానవాభివృద్ధి సూచిక అనే కార్యక్రమం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ పి ప్రశాంతి ఆదేశాల మేరకు అధికారులకు మరిన్ని సూచనలు సలహాలు అందించినట్లు తెలిపారు. సోమవారం నుంచి త్వరితగతిన సర్వే చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సర్వే ద్వారా గ్రామంలోని ప్రతి ఒక్కరి వివరాలు, ఆరోగ్య, సామాజిక పరిస్థితులు నమోదు చేస్తామన్నారు. క్షేత్రస్థాయిలో సచివాలయ అధికారుల బృందం ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తారని అన్నారు. సేకరించిన డేటాను ఆన్‌లైన్ యాప్‌లో పొందుపరుస్తారని ఇదంతా ప్రభుత్వాధీనంలో ఉంటుందన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం చేపడుతున్న సర్వేలో ప్రతి ఒక్కరూ వివరాలు నమోదు చేయించుకోవాలన్నారు. ఈ సర్వే కోసం గ్రామ వలంటీర్లు, డ్వాక్రా మహిళలు, గ్రామ పెద్దల సహకారం తీసుకుంటామన్నారు. ఏఎస్ఓ రామారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఆకివీడు: వైఎస్సార్ ఆసరా కార్యక్రమానికి దెందులూరు వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు

రామాలయ పునర్నిర్మాణ పూజలు ప్రారంభం



శ్రీ సింహాద్రి అప్పన్న కోదండ రామాలయం వద్ద పూజలు చేస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశంచౌక్): భీమవరంలో చరిత్ర కలిగిన ఆలయాల్లో ఒకటైన శ్రీ సింహాద్రి అప్పన్న కోదండ రామాలయం పున నిర్మాణ విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక కార్యక్రమాలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. గోపూజ, వేద స్వస్తి, ఆలయ శాలప్రదక్షణం, అఖండ స్థాపన, నీరాజన మంత్ర పుష్పాలు, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలను నిర్వహించారు. సింహాద్రి అప్పన్న కోదండ రామాలయం కమిటీ ఆధ్వర్యంలో పుల్లేటికుర్తి గణపతి శర్మ బ్రహ్మలో గనిరెడ్డి శివ కుమార్, సూర్య కళ దంపతుల చేతుల మీదుగా ఈనెల 27వ తేదీన సోమవారం శ్రీ సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ, గణపతి, అయ్యప్ప, సుబ్రహ్మణ్య సాయి, శిఖర, ద్వారపాలక ప్రతిష్ఠలను చేయనున్నారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేను రాజు, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తదితరులు హాజరుకానున్నారు. విగ్రహ ప్రతిష్ఠ అనంతరం ఆలయం వద్ద అఖండ అన్న సమారాధన ఏర్పాటు చేసినట్లు శ్రీ సింహాద్రి అప్పన్న కోదండ రామాలయం కమిటీ సభ్యులు తెలిపారు.

నిందితులను అరెస్ట్ చేయాలి



రాయకుదురులో మాట్లాడుతున్న నల్లి రాజేష్

వీరవాసరం: రాయకుదురు సర్పంచ్‌ను కులం పేరుతో దూషించిన పెనపరెడ్డి పెద్దిరాజును వెంటనే అరెస్ట్ చేయాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్ డిమాండ్ చేశారు. రాయకుదురు సర్పంచ్ గడ్డం భారతికి సంఘీభావం ప్రకటించి శనివారం సంఘటన ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత మహిళను చూడకుండా ఇష్టానుసారంగా కులం పేరుతో దూషిస్తూ ఆలయంలోకి ప్రవేశం లేకుండా అడ్డుకున్న పెద్దిరాజు, అతని కుమారుడు నాగాంజనేయులును పోలీసులు తక్షణం అరెస్టు చేయకపోతే నిరాహార దీక్షకు దిగుతామని హెచ్చరించారు. పంచాయతీ కార్యాలయం నుంచి గ్రామ సర్పంచ్ గడ్డం భారత్ ని ర్యాలీగా తీసుకుని వెళ్లి ఆలయం వద్దకు వెళ్లి కొబ్బరికాయలు కొట్టడానికి ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న పెద్దిరాజు తాళం వేయడంతో అక్కడే గుడి బయట తాళం వేసిన చోట కొబ్బరికాయలు కొట్టి తిరిగి వచ్చారు .అనంతరం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలనేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గెడ్డం భాస్కరరావు, కర్రి జోగాయ్య, మోకా నరిసింహారావు, గుండె నగేష్ బాబు, సరెళ్ల శ్రీనివాస్, తందా ఇషాకు రాజు, ఏనుగుపల్లి చంద్రశేఖర్, గాది రవి, బందారు బాల సుందరం పాల్గొన్నారు.